కథ

# పనసపండు


–వసంత కుమార్ సూరిశెట్టి





గిరిధర్, రాధిక గంట సేపటి నుంచీ పోట్లాడుకుంటున్నారు. పెళ్ళయ్యి రెండేళ్ళవుతున్నా వాళ్ళెప్పుడూ ఇంతగా పోట్లాడుకోలేదు.

కూర గిన్నెను తీసుకుని వాసన చూశాడు గిరిధర్.

"ఏం కూరే ఇది? పాడైపోయిన వాసనేస్తుంది?" అంటూ విసిరి కొట్టాడు.

చారులో వేలు ముంచి రుచి చూసి–

"ఇంత ఉప్పేసుకొని తింటే ఆరోగ్యం ఏమవుతుంది?" అంటూ చారుని తీసుకుని వెళ్ళి బయట పారబోసి వచ్చాడు.

ఇరుగు పొరుగు వాళ్ళు చెవులు నిక్కబొడు చుకుని వీళ్ళ మాటల్ని వినసాగారు.

రాధిక ఇంటి లోపలకు వెళ్ళి గిరిధర్ వేసుకుని విప్పేసిన నాలుగైదు షర్టుల్ని తీసుకొచ్చి హాల్లో పడేసింది.

"అన్ని షర్టుల మీద మరకలు. పాన్ పరాగ్ మరకలు. వీటిని ఉతకడం నావల్ల కావడం లేదు" అంది నిరసనగా.

"నోర్ముయ్! కొట్టానంటే చూడు మళ్ళీ..." అంటూ ఆమె వాక్ప్రవాహాన్ని అడ్డుకున్నాడు.

"ఇగో! మగాడినన్న పొగరు . ఇవి మిమ్మల్ని వదిలిపోవు. అవి ఏ రోజు పోతాయో ఆరోజే బాగుపడతారు" అంది.

"సంపాదిస్తున్నానన్న పొగరు నీకు".

కొంగుని తీసి నోటికడ్డంగా పెట్టుకుని ఏడ వసాగింది రాధిక.

"ఇక మీద నేను ఓపిక పట్టలేను. నేను మా అమ్మ దగ్గరకు వెళ్ళిపోతాను" అంది రాధిక.

"పోతే పోనే! నేనూ మా అమ్మ దగ్గరికి వెళ్ళిపోతాను".

రాధిక బ్రీఫ్ కేసు సర్దుకుని బయటకు నడిచింది.

గిరిధర్ ఇంటికి తాళం వేసి స్కూటర్ మీద బయలుదేరాడు.

తిన్నగా ఆఫీసుకెళ్ళి లీవు లెటరు ఇచ్చేసి అన్నానగర్ వెళ్ళే టౌన్ బస్సు ఎక్కి కూర్చుంది రాధిక.

కంపెనీకెళ్ళి రెండు గంటలు పర్మిషన్ తీసుకుని గాంధీనగర్‌కి స్కూటర్ మీద బయలుదేరాడు గిరిధర్.

వేళకాని వేళలో వచ్చిన. అల్లుణ్ణి చూసి ఆశ్చర్యపోయింది కాంతమ్మ.

"రండి అల్లుడు గారూ రండి",

లోపలికి వచ్చి సోఫాలో కూర్చున్నాడు గిరిధర్.

"రాధిక ఎలా వుంది?"

"అమ్మా! మీ అమ్మాయి గురించి చెప్పడానికే వచ్చాను. కొంచెం కూడా బాధ్యత లేకుండా ప్రవర్తిస్తోంది. పాడైపోయిన కూరలు, ఉప్పు ఎక్కువైన చారు తింటే ఆరోగ్యం ఏమవుతుందో మీరే చెప్పండి. అసలే ఒట్టి మనిషి కూడా కాదు. నాకు కోపం వచ్చి బాగా తిట్టేశానమ్మా!"

అల్లుడు తనను మాటి మాటికీ అమ్మా, అమ్మా అని పిలుస్తుంటే ఆనందంతో పొంగిపోయింది కాంతమ్మ.

"అల్లుడు గారూ! ఏమిటి రాధిక ... నిజమేనా మీరు చెప్పేది?" అంది వెలిగిపోతున్న మొహంతో.

"అవునమ్మా! నిన్ననే డాక్టరు గారు చెప్పారు".

"చాలా సంతోషంగా వుంది అల్లుడు గారూ! ఇప్పుడే వెళ్ళి దాన్ని చూడాలని వుంది. రాధిక గురించి మీకు తెలుసు కదా! కొంచెం పట్టుదల ఎక్కువ. ప్రతి విషయానికీ సీరియస్ అయిపోతుందే గాని, మీరంటే దానికి బోల్డంత ఇష్టం".

"నన్ను పట్టించుకోక పోయినా ఫరవాలేదమ్మా! తనని తాను గమనించుకోవడం లేదన్నదే నా బాధా, కోపం".

"మీరిద్దరూ ఒకరినొకరు అర్థం చేసుకోవాలి. జీవితాన్ని ఆనందంగా గడపాలి. అందుకోసమే గదా నేనూ, మీ అమ్మా కలిసి ఆలోచించి మీ ఇద్దర్నీ వేరే కాపురం పెట్టించాం! మీరే కొంచెం సర్దుకుపోవాలి అల్లుడు గారూ".

"అలాగే అమ్మా" అన్నాడు. కోపం కొంచెం చల్లారగా—

"ఇక మీదట చూడండి. రాధికనెలా చూసుకుంటానో! మీతో ఒక మాట చెప్పేసి పోదామని వచ్చాను. వెళ్ళొస్తానమ్మా".

అల్లుణ్ణి చూస్తూ తన్మయంలో మునిగిపోయింది కాంతమ్మ.

* * *

ఉలుకూ, పలుకూ లేకుండా వూడిపడ్డ కోడల్ని చూసి ఆశ్చర్యపోయింది పూర్ణమ్మ.

"రామ్మా రాధికా. బాగున్నావా? గిరిధర్ రాలేదా?"

"అమ్మా మీ అబ్బాయి..." అంటూ పూర్ణమ్మ ఒళ్ళో తల పెట్టుకుని ఏడవసాగింది రాధిక.

తనని అమ్మ స్థానంలో వుంచిన కోడల్ని ప్రేమగా చూస్తూ—

"ఏం జరిగిందో నెమ్మదిగా చెప్పమ్మా!' ఆ రాస్కెల్ నిన్నేమన్నా అన్నాడా?"

తక్కున పైకి లేచింది రాధిక.

"ఆయన్ని అలా తిట్టకండమ్మా" అంది.

"మొగుణ్ణి ఒక్క మాట అననివ్వవే! సరే! జరిగిందేమిటో చెప్పు".

"ఆయన పాన్ పరాగ్ చాలా ఎక్కువగా తింటున్నారమ్మా! ఒంటికి మంచిది కాదన్నా వినడం లేదు" కళ్ళని చేతి రుమాలుతో తుడుచుకుంటూ అంది.

"తర్వాత నిన్ననే డాక్టరు గారు చెప్పారు మీకు మనవడు పుట్టబోతున్నాడని. అది విన్న




దగ్గర్నుంచి ఇంటినిండా హార్లిక్సు, బోర్నవీటా బాటిల్సే. రకరకాల పళ్ళు తీసుకువచ్చి తినాలని బలవంతం చేస్తున్నారు. మా సంపాదనలో ఇవన్నీ సాధ్యమా చెప్పండి అమ్మా! వినకపోతే తిడుతున్నారు" అంది రాధిక ఫిర్యాదు చేస్తూ.

పూర్ణమ్మకి మనవడు పుట్టబోతున్నాడని కోడలు చెప్పిన మాటలు తప్ప మిగిలిన మాటలు వినిపించలేదు. ఆనందంతో ఆమె మొహం వికసించింది.

"ఏమిటే! నేను నానమ్మని కాబోతున్నానా?"

"ఇదిగో చూడమ్మా రాధికా నువ్వే వాణ్ణి మంచిగా మారుస్తావన్న నమ్మకంతోనే నేనూ, మీ అమ్మా కలసి మిమ్మల్ని వేరే కాపురం పెట్టించాం. వాడి దగ్గర వున్న ఒకే ఒక చెడ్డ గుణం ముక్కోపం. అది లేకపోతే నా కొడుకు బంగారం. నువ్వంటే వాడికి పంచప్రాణాలు. నాకన్నా వాడికి నువ్వే ఎక్కువ. వాడి మీద కోపం తెచ్చుకోకేం".

"లేదమ్మా! నన్ను తిట్టినా కొట్టినా ఫరవాలేదు. ఆయన ఆరోగ్యం పాడవకూడదన్నదే నా బాధంతాను" అంది.

"అన్నీ సర్దుకుపోతాయి. మేము లేమూ? నువ్వు ధైర్యంగా ఇంటికి వెళ్ళు" అని కోడల్ని వూరడించింది.

పైకి చూడ్డానికి ముల్లు, ముల్లుగా గట్టిగా వుండి లోపల తీయటి తొనలతో నిండి వుండే పనస పండు లాంటి వాళ్ళ సంసారాన్ని చూసి ఆనందంగా ఒక నిట్టూర్పు విడిచింది పూర్ణమ్మ.